# వన్డే ... వన్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన




- టిఎస్ఐసి, నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు
- వన్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన అదనపు కలెక్టర్ రాంబాబు
- 30మంది ఆవిష్కర్తల నుండి వారి కొత్త ఆలోచనల ప్రదర్శన
- హాజరైన 750మందికి పైగా రైతులు, ప్రజలు



**కొత్తగూడెం, ఫిబ్రవరి15(కెరటం ప్రతినిధి)**

ఆవిష్కర్తలు, రైతులు మధ్య సంబంధాలను పెంపొందించుకోవడానికి వన్డే.. వన్ ఎగ్జిబిషన్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో టిఎస్ఐసి, నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన్డే ... వన్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఎస్ఐసి, నాబార్డు ఏర్పాటు చేసిన వన్ డే .. వన్ ఎగ్జిబిషన్ విజయవంతంగా నిర్వహించడం పట్ల అభినందించారు. క్షేత్ర స్థాయి ఆవిష్కరణల ప్రదర్శన నిర్వహించినట్లు చెప్పారు. రైతులకు అండగా నిలిచే ప్రత్యేక కార్యక్రమమని చెప్పారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టిఎస్ఐసి) ఆధ్వర్యంలో, నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని చెప్పారు. ఈ కార్యక్రమానికి 750 మందికి పైగా రైతులు, ప్రజలు, ఆసక్తి కలగిన వ్యక్తులు హాజరయ్యారని చెప్పారు. వ్యవసాయం, నీటి వ్యవస్థలు, వ్యర్థాల నిర్వహణ, పాడి పరిశ్రమ, గ్రామీణ సంఘాలను మెరుగుపరచడానికి మార్గాలను కనుగొన్న 30మంది ఆవిష్కర్తల నుండి వారి కొత్త ఆలోచనలను ప్రదర్శనలను వీక్షించినట్లు చెప్పారు. ఈ ఆలోచనలు రైతులకు మార్పును కలిగిస్తాయని చెప్పారు. సంచలనాత్మక పరిష్కారాల అమలు, వినియోగాలను సులభతరం చేస్తుందని చెప్పారు. గ్రామీణ స్థాయి ఆవిష్కరణలకు మార్కెట్‌ను ఏర్పాటు చేయడంలో ఒక ముఖ్యమైన పురోగతిని సూచిస్తుందని చెప్పారు. గ్రామీణ స్థాయి ఆవిష్కరణల కోసం మార్కెట్‌ను సృష్టించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనలు ఆవిష్కర్తలు, లబ్ధిదారుల మధ్య విలువైన సంబంధాలను సులభతరం చేయటమే కాక, రైతులు, స్థానిక సంఘాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న పరిష్కారాలను స్వీకరించి అమలు చేయడంపై చర్యలను ప్రోత్సహిస్తాయని చెప్పారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో వినూత్న పరిష్కారాల విస్తరణ, రైతులు, స్థానిక కార్మికులకు శారీరక శ్రమను తగ్గించడం, తక్కువ-ధర స్థిరమైన పరిష్కారాలపై అవగాహన పెరగడం, 30 మంది భాగస్వామ్య ఆవిష్కర్తలకు కొత్త మార్కెట్ యాక్సెస్, వ్యాపార అవకాశాలు వంటివి ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా ఫలితాలు సాధనకు ఉపయోగపడతాయని చెప్పారు. తెలంగాణలో ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించేందుకు తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ముఖ్య లక్ష్యాన్ని ఈ కార్యక్రమం చాటి చెబుతుందని చెప్పారు. గ్రామీణ ఆవిష్కర్తలకు వేదికను కల్పించడం ద్వారా, రాష్ట్రంలో సానుకూల మార్పులను నడపడానికి సహకారాన్ని ప్రోత్సహిస్తుందన్నారు.

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) భారతదేశపు అత్యున్నత అభివృద్ధి బ్యాంకుగా కొనసాగుతుందని, ఆర్థిక, ఆర్థికేతర జోక్యాలు, ఆవిష్కరణలు, సంస్థాగత అభివృద్ధి ద్వారా స్థిరమైన మరియు సమానమైన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించడానికి అంకితం చేయబడినట్లు చెప్పారు. రైతుల సాధికారత మరియు గ్రామీణ ప్రకృతి దృశ్యంలో సానుకూల మార్పులను అభివృద్ధి పరచడానికి నాబార్డ్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ ప్రారంభించిన స్టేట్ ఇన్నోవేషన్ 2017లో స్థాపించబడినట్లు చెప్పారు. ఇన్నోవేశన్ సెల్ గుర్తించబడిన ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, వ్యవస్థాప కులు, ఆవిష్కరణల ఉత్ప్రేరకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ సంస్కృతిని పెంపొందించడానికి ఒక సమగ్ర విధానంతో ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యుడు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



# నేడు దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె

- గ్రామీణ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు
- కార్మికులను నిలువునా శ్రమదోపిడీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- మోటర్ వాహన చట్టం - 2019ని సవరించాలి
- కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు



**కొత్తగూడెం, ఫిబ్రవరి15(కెరటం ప్రతినిధి)**

నేడు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని, ఈ సమ్మెకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, కావున శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గల కార్మికులు సమ్మెలో పాల్వంచ పట్టణ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు, బ్లాక్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులకు, అనుబంధ సంఘ అధ్యక్షులకు, కార్యవర్గ సభ్యులకు, కార్యకర్తలకు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు అనేక సమస్యలపై పోరాటం చేస్తున్నారని, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం కార్మిక హక్కులను కాలరాస్తు, వారి సంక్షేమానికి ఏ మాత్రం ఉపయోగపడక వారిని శ్రమను నిలువునా దోపిడీ చేస్తుందని విమర్శించారు. భారత్ న్యాయ సంహిత, హిట్ అండ్ రన్ సెక్షన్ 106(1)(2)లని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసి మోటర్ వాహన చట్టం 2019ని సవరించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల పిల్లలకి స్కాలర్షిప్‌లు, ఇల్లు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య సమస్యలు పరిష్కారం చేయకుండా చట్టాలను నిర్వీర్యం చేస్తుందని అన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలను వెంటనే తగ్గించాలని, ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, హమాలీ, కార్మికులు సంక్షేమ బోర్డును వెంటనే ఇవ్వాలని, విద్యా వైద్యం ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. కాంగ్రెస్ శ్రేణులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు తెలిపారు.



## నూతన సీఐని కలిసిన జర్నలిస్ట్ ఫోరం ఆఫ్ భద్రాద్రి ప్రెస్‌క్లబ్ సభ్యులు

**భద్రాచలం, ఫిబ్రవరి15(కెరటం ప్రతినిధి)**

ఇటీవల పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బదిలీల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన రాయల వెంకటేశ్వర్లుని జర్నలిస్ట్ ఫోరమ్ ఆఫ్ భద్రాద్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డు ఆనంద్, సెక్రెటరీ జోసఫ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరీ అనిల్, ప్రెస్ క్లబ్ పిఆర్ఓ మదార్, రామకృష్ణ, వాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కొత్తగూడెం, ఫిబ్రవరి15(కెరటం ప్రతినిధి)

బంజారాల ఆరాధ్యదైవం శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ 285 జయంతి సందర్బంగా తెలంగాణ ప్రభుత్వం బంజారాలకు సెలవు దినం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. పాల్వంచ మండలం అంబేద్కర్ సెంటర్ నందు ఎస్టీ సెల్ జిల్లా నాయకులు గుగులోత్ దేవీలాల్ నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్బంగా దేవీలాల్ నాయక్ మాట్లాడుతూ బంజారాల చిరకాల వాంచ అయినా సేవాలాల్ జయంతిని సెలవు దీనంగా ప్రకటించాలని గత 25 సంవత్సరాల నుండి బంజారజాతి డిమాండ్ చేయడం జరిగిందని, కానీ గత ప్రభుత్వాలు బంజారాలపై చిన్న చూపుగా కనికరించలేదన్నారు. ఆనాడు ఇందిరా గాంధీ బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చి బంజారాలను గౌరవించి బంజారాల అభివృద్ధికి పాటుపడ్డారో అదేవిధంగా గత వారం క్రితం మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నాయకత్వంలో రేవంత్ రెడ్డి దృష్టికి సేవలాల్



మహారాజ్ జయంతికి సెలవు ప్రటించాలని చెబితే వారు బంజారాల చిరకాల వాంచ అయినా సేవలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రటించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా మొన్న ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఎస్టీలకు పెద్ద పీట వేసి ఎస్టీ సంక్షేమం కోసం రూ.13,000 కోట్లు కేటాయించడం జరిగిందని ఇది శుభసుచకమని కొనియాడారు. ఈ సందర్బంగా బంజారా జాతి తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌కి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కి ధన్యవాదములు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి బంజారాలు ఎప్పటికి రుణపడి ఉంటారని తెలిపారు. ఈసందర్బంగా రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాబు నాయక్, ఉపేందర్ నాయక్, భద్రు నాయక్, పాల్వంచ మండల అధ్యక్షులు కొండం వెంకన్న, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు రాము, భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్‌లో టాప్ స్కోరింగ్ సాధించిన రెసొనెన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి15(కెరటం ప్రతినిధి)

ఐఐటి, ఎన్ఐటిలలో ప్రవేశానికి సంబందించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ తొలివిడత పరీక్ష ఫలితాలలో రెసొనెన్స్ జూనియర్ కళాశాలలు, హైదరాబాద్, విధ్యార్థులు అద్భుతమైన ప్రదర్శనతో చరిత్ర సృష్టించారు. ఐఐటి, ఎన్ఐటి, ఎన్ఇఇటి, మెడికల్ ప్రవేశ పరీక్షలలో అగ్రశ్రేణి ర్యాంకర్లను తయారు చేయడంలో రెసొనెన్స్ జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్. రెసొనెన్స్ జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు పరీక్షలో అత్యుత్తమ స్కోర్ సాధించారు. టాప్ స్కోర్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో మాదాపూర్ లోని రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో ఈ సందర్బంగా రెసొనెన్స్ హైదరాబాద్ సెంటర్స్ డ్కెరెక్టర్ పూర్ణచంద్ర రావు సత్కరించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా జేఈఈ పరీక్షలో రెసొనెన్స్ అద్భుత ఫలితాలను సాధించింద న్నారు. ఇది రెసొనెన్స్, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు ఒక అఖండ విజయం అని అన్నారు.



**రెసొనెన్స్ గురించి..**

కోట రాజస్థాన్ నుండి 2001 సంవత్సరంలో మిస్టర్ ఆర్.కె.వర్మ ఐఐటి మద్రాస్‌చే స్థాపించబడిన అఖిల భారత సంస్థ రెసొనెన్స్. రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన నాటి నుండి, రెసొనెన్స్ 150 కేంద్రాలతో 87 నగరాల్లో దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నది. రెసొనెన్స్ 9 లక్షల మందికి పైగా విద్యార్థులకు శిక్షణను ఇచ్చింది, ఇప్పటి వరకు 3,00,000ం ఐఐటి, ఎన్ఐటి, మెడికల్ ర్యాంకర్లను తయారు చేసింది. భారతదేశ వ్యాప్తంగా ఐఐటి, ఎన్ఐటి, ఎన్ఇఇటి ఔత్సాహికుల్కెన లక్షలాది మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన తర్వాత, రెసొనెన్స్ కోటా తన 20 సంవత్సరాల వారసత్వాన్ని, విజయ పరంపరను 2018లో రెసొనెన్స్ హైదరాబాద్ సెంటర్స్ డ్కెరెక్టర్ పూర్ణచంద్ర రావు హైద రాబాద్‌కు తీసుకువచ్చారు.



# తండ్రి బాటలో తనయులు..

## లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఔదార్యం...!

- ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనేక సౌకర్యాలు కల్పన

భద్రాచలం, ఫిబ్రవరి15(కెరటం ప్రతినిధి)



లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత దివంగత మాగంటి సూర్యం కుమారులు వారి తండ్రి లాగానే తమ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ తమ ఔదార్యాన్ని ప్రదర్శిస్తున్నారు. భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ ల్యాబ్, కళాశాల కార్యాలయం నందు రూ.1.5 లక్షల వ్యయంతో పిఓపి సీలింగ్ ఏర్పాటు చేశారు. కళాశాల తరగతి గదుల్లో ప్రతి ఏటా కావలసిన విద్యుత్తు ట్యూబ్ లైట్లు 30 ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా కళాశాల ప్రధాన గేటుకు ప్రతి సంవత్సరం పెయింటింగ్ వేపించి సహకరిస్తున్నారు. ఆర్ఓ ప్లాంట్ ను కూడా సొంత నిధులను వెచ్చించి పిల్లల తాగునీటి ఇక్కట్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల చైర్మన్ గా ఉన్న దివంగత మాగంటి సూర్యం కుమారులు..వారి నాన్న లాగానే తమ కళాశాల పిల్లల సౌకర్యార్థం ఎంతగానో సహకరిస్తున్నారని భద్రాచలం ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణవేణి పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా గురువారం లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ మాగంటి రమేష్ బాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆధ్యాపకులు ఖుర్షీద్ అహ్మద్, వర రాజు, లైబ్రేరియన్ పోచాలరావు, లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాల మ్యాథ్స్ అధ్యాపకులు బషీర్ తదితరులు పాల్గొన్నారు.






# పార్లమెంట్ బరిలో వకీల్‌సాబ్

## ఖమ్మం స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి..

- 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ
- ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలన్న సంకల్పంతో ముందుకు..
- నవత బుక్ స్టాల్ స్థాపించి ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు చేయూత
- ప్రజల కష్టాలను న్యాయవాదిగా కండ్లారా చూశా..
- ప్రముఖ న్యాయవాది, ఖమ్మం పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి కటుకోజ్వల నాగేశ్వరరావు

కొత్తగూడెం, ఫిబ్రవరి15(కెరటం ప్రతినిధి)

" అతనో వకీల్‌సాబ్.. దాదాపు 15 ఏండ్లకు పైగా కొత్తగూడెం కోర్టులో అనునిత్యం ప్రజల సమస్యలు.. కష్టాలను కండ్లారా చూస్తూ.. వస్తున్నారు. నిరక్షరాస్యత మూలంగా పడుతున్న ఇబ్బందులు.. అనారోగ్య సమస్యలు వస్తే వాటిని నయం చేసుకోవడానికి అనుభవిస్తున్న బాధలను చూసి చలించిపోయాడు. ఈ బాధల నుంచి నిరుపేద ప్రజలను బయటపడేయాలంటే ఒక్క రాజకీయాల ద్వారానే మాత్రమే సాధ్యమని నమ్మాడు. ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలన్న లక్ష్యంతో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిచి కొత్తగూడెం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేశారు. అంతేకాదు త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం స్థానానికి స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో అడుగులు వేస్తున్నారు. ఇంతకీ ఆయన ఎవరో కాదు ప్రముఖ న్యాయవాది కటుకోజ్వల నాగేశ్వరరావు. యువత రాజకీయాల్లోకి రావాలని.. సమాజంలో మార్పు జరగాలంటే ఒక్క రాజకీయం ప్రధాన ఆయుధమంటున్న కటుకోజ్వల నాగేశ్వరరావుతో కెరటం ప్రత్యేక

### అతడే ఒక సైన్యంలా కటుకోజ్వల నాగేశ్వరరావు అడుగులు

కథనం..

**కటుకోజ్వల నాగేశ్వరరావు కుటుంబ నేపథ్యమిది..**



కటుకోజ్వల సుగుణమ్మ, చంద్రయ్య దంపతులకు ముగ్గురు మగ, ఇద్దరు ఆడ సంతా నంలో పెద్దవాడు కటుకోజ్వల నాగేశ్వరరావు. ఆయన స్వగ్రామం కొక్కిరేణి గ్రామం, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మం జిల్లా. నాగేశ్వరరావు విద్యాభ్యాసం మొత్తం కొక్కిరేణి గ్రామంలోనే సాగింది. ఆ తర్వాత డిగ్రీ, ఎల్ఎల్‌బి పూర్తి చేశారు. కాగా 1982లో కొత్తగూడెం వచ్చారు. నాగేశ్వరరావుకు జ్యోతితో వివాహం కాగా, చందన, శ్రావణి కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం 2008 నుంచి కొత్తగూడెం కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. కటుకోజ్వల నాగేశ్వరరావు 1982లో కొత్తగూడెం వచ్చిన తొలినాళ్లలో చదువుకు నేందుకు పుస్తకాలు కూడా అందని రోజుల్లో పోస్టాఫీస్ ఏరియాలో నవత సెకెండ్‌హ్యాండ్ బుక్‌స్టాల్‌ను స్థాపించి కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట, సత్తుపల్లి, రామగుండం, మందమర్రి, ఇల్లందు పరిసర ప్రాంత నిరుపేద విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఈ బుక్‌స్టాల్ నేటికీ కొనసాగుతోంది.

**అవకాశం ఇస్తే.. ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలనే..**

సువిశాల భారతదేశంలో విద్య, వైద్యం సవ్యంగా అందడం లేదని, సామాన్యుడు వీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి దాపురించి ఆర్థిక భారంతో నలిగిపోతున్నాడని ఒక్క అవకాశం ఇస్తే ప్రజలకు వీటిని ఉచితంగా అందించడమే కాకుండా ప్రభుత్వానికి విన్నవిస్తానని, అవసరం అయితే న్యాయస్థానాల ద్వారా ఒక న్యాయవాదిగా వీటిని ఉచితంగా అందించేందుకు శక్తిమేరకు శ్రమిస్తానని ప్రముఖ న్యాయవాది, ఖమ్మం పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి కటుకోజ్వల నాగేశ్వరరావు తెలిపారు. అంతేకాదు ఎంపీ ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ ఇస్తే రైతులకు మద్దతు ధర, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిరిజర్వేషన్లు రద్దు చేయడం, ప్రభుత్వ ఉద్యోగాలతో సమానంగా కాంట్రాక్ట్ ఉద్యోగాలకు వేతనాలు ఇవ్వడం, మూతబడ్డ పరిశ్రమలు పునరుద్దరణ, మేక్ ఇన్ ఇండియాలో భాగంగా ప్రతి మండలంలో ఒక పరిశ్రమ ఏర్పాటు చేసేలా చూడడం, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో పాటు కొత్తగూడెంలో ఎయిర్ పోర్టు వంటి వాటిని నెలకొల్పేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల కష్టాలను న్యాయవాదిగా కండ్లారా చూశానని, ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించే వారికి అవకాశం ఇవ్వాలని, ప్రజాస్వామ్యంలో కల్పించిన ఓటు హక్కును అమ్ముకోకుండా దేశ భవిష్యత్తును నిర్ణయించేగా ఉండాలని, అందుకు సరైన వారికి ఓటు వేయాలని, ఉన్నత విద్యావంతుడిగా తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రముఖ న్యాయవాది, ఖమ్మం పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి కటుకోజ్వల నాగేశ్వరరావు కోరారు.

## అయోధ్య వెళ్లే రామ భక్తులకు ఘనంగా స్వాగత ఏర్పాట్లు

**బిజెపి జిల్లా అధ్యక్షులు కె.వి రంగాకిరణ్**

కొత్తగూడెం, ఫిబ్రవరి15(కెరటం ప్రతినిధి)



అయోధ్య బాల రాముని దర్శించుకునేందుకు నేడు కొత్తగూడెం భద్రాచలం రోడ్ నుండి తరలి వెళ్లేందుకు బయలుదేరుతున్న రామ భక్తులకు భారీ స్వాగత ఏర్పాట్లు చేస్తున్నట్టు బిజెపి జిల్లా అధ్యక్షులు కె.వి రంగాకిరణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 500 సంవత్సరాలుగా అయోధ్య రామ మందిర నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలో అయోధ్య రామ మందిరం నిర్మాణమైనదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, భారతీయ రైల్వేలు సంయుక్తంగా ఆస్తా పేరుతో అయోధ్య రాముని దర్శించుకునేందుకు రామ భక్తుల కొరకు ప్రత్యేకమైన ట్రైన్లు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రేపు కొత్తగూడెం నుండి ట్రైన్ వెళ్లనుందని తెలిపారు. ఆ బాల రాముని దర్శించుకొనేందుకు వెళ్లే రామ భక్తులకు, హిందూ బంధువులు, బిజెపి కార్యకర్తలు, వివిధ పరివార క్షేత్రాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నేడు ఉదయం 11 గంటలకు కొత్తగూడెం రైల్వే స్టేషన్‌కు చేరుకోని వారికి స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలపాలని పేర్కొన్నారు.



## డీపీవోను కలిసిన పలువురి ఎంపీవోలు

కొత్తగూడెం, ఫిబ్రవరి15(కెరటం ప్రతినిధి)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా పంచాయతీ అధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నూతన జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, భద్రాద్రి డివిజనల్ పంచాయతీ అధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సుధీర్ కుమార్‌ని స్నేహపూర్వకముగా పలువురి ఎంపీవోలు కలిశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపల్లి మండల పంచాయతీ అధికారి బత్తిన శ్రీనివాసరావు, గుండాల మండల పంచాయతీ అధికారి ఎస్.కె వలి హజరత్, జూలూరుపాడు మండల పంచాయతీ అధికారి తోట తులసి రామ్, ఇల్లందు మండల పంచాయతీ అధికారి చిరంజీవి పాల్గొన్నారు. వీరు కలిసిన సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి వివిధ మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలు ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో పారిశుద్ధ కార్యక్రమాలు విస్తృతస్థాయిలో నిర్వహించాలని, రాబోవు వేసవికాలంలో నీటి ఎద్దడి ఏర్పడ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## 'రహ్నుమాయి' కేంద్రం ప్రారంభం

హైదరాబాద్,ఫిబ్రవరి15(కెరటం ప్రతినిధి)

వివిధ ప్రభుత్వ పథకాలు, సేవలతో ప్రజలను కనెక్ట్ చేయడమే లక్ష్యంగా హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ (హెచ్ హెచ్ ఎఫ్) ఆధ్వర్యంలో లాంగర్ హౌజ్‌లోని మస్జిద్ ఈ మహమ్మదీయాలో ఏర్పాటు చేసిన 'రహ్నుమాయి' కేంద్రాన్ని ప్రభుత్వ సలహాదారు (మైనార్టీ సంక్షేమం) ఎండీ షబీర్ అలీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వనున్న అనేక పథకాలకు రేషన్ కార్డుల నమోదు కీలకమన్నారు. టీఎమ్ఆర్ఈఐఎస్‌లో అందిస్తున్న ఉచిత విద్యను వినియోగించుకునేలా మైనార్టీలను ప్రోత్సహించాలని కోరారు. మసీదుల్లోని ప్రతి కేంద్రాన్ని ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన ఉన్న కౌన్సెలర్లు, నిపుణుల బృందం నిర్వహిస్తుందన్నారు. వీరంతా శిక్షణ పొందిన వారేనన్నారు. ప్రారంభంలో రహ్నుమాయి కేంద్రాలు 15-20 మసీదులలో తెరవబడతాయన్నారు. ప్రతి కుటుంబం వివరాలు నమోదు చేయడానికి ప్రత్యేక యాప్ రూపొందించబడిందని తెలిపారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్‌కు చెందిన ముజ్తబా హసన్ అస్కారీ మాట్లాడుతూ సామాన్య ప్రజానీకానికి, ప్రజారోగ్యానికి మధ్య వారధిగా గత పదేళ్లగా హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ పని చేస్తోందన్నారు. నగరంలో 15 మసీదుల సహకారంతో ఈ సిటిజన్ కనెక్ట్




నడవనుందన్నారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ చేసిన సర్వేలలో వివిధ ప్రభుత్వ పథకాలలో ముస్లిం మైనారిటీల నమోదు పేలవంగా ఉన్నట్లు తేలిందన్నారు. 32-35 శాతం ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు లేవన్నారు. 35-38 శాతం మందికి సరిదిద్దాల్సిన రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. 25 శాతం మందికి రేషన్ కార్డులు లేవన్నారు. 14 శాతం మంది పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలకు వెళుతున్నారని తెలిపారు.